సాక్షి
జనగామ
బుధవారం | 3 | సెప్టెంబర్ | 2025



గంజాయి పట్టివేత
ఖానాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలుకలగుట్ట దగ్గర రూ.3.81కోట్ల విలువైన 763 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. - 8లో▸



మంత్రుల కాన్వాయ్ అడ్డగింత
కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మంత్రుల కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/23^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్న సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. అక్కడక్కడా మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చిల్కూరు హుండీ ఆదాయం రూ.10.67లక్షలు



చిల్కూరు: చిల్కూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల నడుమ అష్టదళ పాదపద్మారాధన పూజ అనంతరం దేవాదాయశాఖ పరిశీలకులు చిందం వంశీ ఆధ్వర్యంలో ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న, చైర్మన పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్తలు గనగోని రమేశ్, పుల్యాల నారాయణరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, గోళి రాజశేఖర్ సమక్షంలో హుండీల లెక్కింపులో స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన వాసవీ వనిత క్లబ్ వారు పాల్గొన్నారు. హుండీల ఆదాయం రూ.10,67,650లతో పాటు ఖతర్ దేశానికి చెందిన 10 రియాల్స్ ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

9, 10 తేదీల్లో ఉద్యోగులకు రాష్ట్రస్థాయి క్రీడలు

జనగామ రూరల్: తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ 2025–26లో ఉద్యోగులు పాల్గొనాలని జిల్లా యువజన క్రీడల అధికారి బి.వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ సెలక్షన్ ట్రయల్స్‌లో భాగంగా హైదరాబాద్‌లో వివిధ స్టేడియాలలో ఈ నెల 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఈనెల 6తేదీ ఉదయం 9 గంటలకు జరిగే సెలక్షన్స్ జరుగనున్నాయి. ఆసక్తిగల ప్రభుత్వ ఉద్యోగులు ఐడీ కార్డు, సర్వీస్ సర్టిఫికెట్ జిరాక్స్‌లతో హాజరు కావాలని ఆయన తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, ఖోఖో క్రీడలు నిర్వహిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు 96521 97323 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

తెలుగు జాతీయ సదస్సుకు కుమారస్వామికి ఆహ్వానం



జనగామ: హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ సంస్థ నిర్వహిస్తున్న తెలుగు సాహితీమూర్తుల సమాలోచన జాతీయ సదస్సుకు వరంగల్ ఎల్బీ కళాశాల తెలుగు విభాగంలో సీనియర్ ఆధ్యాపకుడిగా పనిచేస్తున్న కోడం కుమారస్వామికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. తెలుగు సాహితీమూర్తులు కాళోజీ నారాయణరావు, దాశరథి సోదరులు కృష్ణమాచార్య, రంగాచార్య, డాక్టర్ సి.నారాయణరెడ్డి శతజయంతిని పురస్కరించుకొని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ డిగ్రీ పీజీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈనెల 10న ఒకరోజు జాతీయ తెలుగు సాహిత్య సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు.కాళోజీ కవిత్వం, మానవతావాద దృక్పథం అనే అంశంపై పత్ర సమర్పణ చేసి ప్రసంగించనున్నట్లు తెలిపారు.

జిల్లావాసికి కీర్తి పురస్కారం



పాలకుర్తి టౌన్: మండలంలోని తొర్రూరు(జె) గ్రామానికి చెందిన రచయిత, సాక్షి జర్నలిస్టు పడిగిపాల అంజనేయులుకు మంగళవారం తెలుగు విశ్వవిద్యాయలం కీర్తి పురస్కారం ప్రదానం చేసింది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో 2023 కీర్తి పురస్కారాన్ని (జీవిత చరిత్ర విభాగం)లో తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎన్.నిత్యానందరావు చేతుల మీదుగా అంజనేయులు అందుకున్నారు. మలేషియా తెలుగు వారి మీద పరిశోధనాత్మక వ్యాసాలు, సామాజిక అంశాల మీద విశ్లేషణాత్మక వ్యాసాలు.. తదితర గ్రంథాలకు గాను కీర్తి పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా అంజనేయులును సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు రాపోలు సత్యనారాయణ, సాహితీవేత్త శంకరమంచి శ్యాంప్రసాద్, మారం లక్ష్మీనారాయణ, మామిండ్ల రమేశ్ రాజా, పులి గణేశ్, గుమ్మడిరాజుల సాంబయ్య తదితరులు అభినందించారు.

మహిళాశక్తి మరింతగా!

- మహిళా సంఘాల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి
- వృద్ధులు, దివ్యాంగులు,కిశోర బాలికలతో గ్రూపుల ఏర్పాటు
- బ్యాంక్ నుంచి లింకేజీ రుణాలు ఇచ్చేలా చర్యలు
- యాక్షన్ ప్లాన్ తయారుచేస్తున్న అధికారులు
- జిల్లావ్యాప్తంగా 1,29,179 మంది సభ్యులు



జనగామ రూరల్: మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వారి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. మహిళా సంఘాలను బలోపేతం చేసి ఆర్థిక సాధికారత సాధించాలన్న లక్ష్యంతో ఇందిర మహిళాశక్తి పథకాన్ని తీసుకొచ్చారు. ఈనేపథ్యంలో వృద్ధులు, దివ్యాంగులు, కిశోర బాలికలకు కొత్తగా మహిళ సంఘ గ్రూపులు ఏర్పాటు చేసి అర్హులైన వారందరికీ బ్యాంక్ రుణాలు అందించేలా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని వృద్ధులు, బాలికలు, దివ్యాంగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గతంలో మహిళా సంఘాలను ఏర్పాటు చేసినప్పుడు 60 ఏళ్లు దాటితే వారిని గ్రూపులోంచి తొలగించారు. ప్రస్తుతం ఉన్నవారిని అలాగే ఉంచాలని, లేకుంటే వారికి ఒక ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు.

వృద్ధులు, దివ్యాంగుల ఆనందం..

గతంలో 60 ఏళ్లు దాటాయంటే మహిళలను గ్రూపు నుంచి తొలగించారు. దీంతో వారు పొదుపు చేసుకునే అవకాశం కోల్పోయారు. ప్రభుత్వం అందించే పథకాలు వర్తించేవి కాదు. వృద్ధులు కావడంతో వారికి బ్యాంక్ రుణాలు ఇవ్వలేమని అప్పుడు తిరస్కరించేవారు. తాజాగా ప్రభుత్వం కచ్చితంగా వృద్ధులకు గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు అందించాలని ఆదేశించడంతో ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ మహిళాసంఘాల ఆధ్వర్యంలో కొత్తగా ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేసి వారికి ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. వీరితోపాటు 15 నుంచి 18 ఏళ్ల వయస్సున్న బాలికలతో కూడా సంఘాలను ఏర్పాటు చేసి వారికీ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. వీరితోపాటు, సామాజిక మాధ్యమాల మోసాలు, అత్యాచారాలు, ఇతరత్రా అంశాలపై వారికి చైతన్యం కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈసారి ప్రత్యేకంగా దివ్యాంగుల కోసం గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. ఒక గ్రామంలో 12 మంది ఉంటే వారికి ఒక గ్రూపు ఏర్పాటు చేయనున్నారు. లేకుంటే వేరే సంఘాల్లో ఉంటారు. వీరందరికీ బ్యాంక్ రుణాలు అందించి వారిని ఆర్థిక సాధికారత సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నారు.



మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసిన అధికారులు(ఫైల్)

ప్రత్యేక కార్యాచరణతో రుణాల అందజేత

ఈనెల 12 నుంచి 14వరకు గ్రామాల వారీగా జాబితా రూపొందించి మహిళా సంఘాల్లో లేని మహిళలు, దివ్యాంగులు, బాలికలను గుర్తిస్తారు. 14 నుంచి 15 వరకు వారికి సంఘాల్లో చేరితే కలిగే ప్రయోజనం గురించి వివరించనున్నారు. బ్యాంక్ రుణాలు అందుతాయని చెప్పి వారిని గ్రూపులో చేర్పించేలా చూస్తారు. 15 నుంచి 30 వరకు సంఘాల్లో చేరిన సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి బ్యాంకుల్లో ఖాతాలను ఓపెన్ చేసి రుణాలు అందిస్తారు. వీరికి సంబంధించిన వివరాలన్నింటినీ సెర్ప్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలు సైతం మంజూరు చేయనున్నారు. రివాల్వింగ్ ఫండ్‌ను ఖాతాల్లో జమచేస్తారు.

జిల్లాలో మహిళా సంఘాల వివరాలు

మండలం	గ్రూపులు	మొత్తం సభ్యులు
బచ్చన్నపేట	1048	12,182
చిల్పూర్	906	10,019
దేవరుప్పుల	1030	11,852
ఘన్‌పూర్(స్టే)	1128	13,067
జనగామ	981	11,402
కొడకండ్ల	694	8,563
లి.ఘణపురం	984	10,943
నర్మెట	566	6,602
పాలకుర్తి	1306	14,335
రఘునాథపల్లి	1275	14,588
తరిగొప్పుల	480	5,539
జఫర్‌ఘడ్	857	9,887
మొత్తం	11,255	1,29,179

మహిళా సాధికారతే లక్ష్యం



మహిళలు సాధికారత సాధించాలన్న ఉద్దేశంతో కొత్తగా మహిళా సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో నూతనంగా వృద్ధులు, దివ్యాంగులకు, బాలికలతో గ్రూపులు ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. వీరికి బ్యాంకు నుంచి లింకేజీ రుణాలు అందిస్తాం.

- వసంత, డీఆర్‌డీఓ, జనగామ

సర్కార్ దవాఖానాల్లో మెరుగైన వైద్యసేవలు



సీటీస్కాన్ సేవలను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా, పక్కన ఎమ్మెల్యే పల్లా, కొమ్మూరి

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా
- జిల్లా జనరల్ ఆస్పత్రిలో సీటీస్కాన్ సేవలు ప్రారంభం

జనగామ: రాష్ట్రంలో సర్కారు దవాఖానాల్లో నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. సాక్షిలో వరుస కథనాలతో జిల్లా ఆస్పత్రిలో సీటీస్కాన్‌యంత్రం వచ్చిన సంగతి తెలిసిందే. జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్ సేవలను మంగళవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, బెన్‌షాలోమ్, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజలింగం, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగమణితో కలిసి మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. సీటీ స్కాన్ సేవలను ప్రారంభించిన అనంతరం మంత్రి జనరల్, డయాలసిస్ వార్డులతో పాటు అన్ని విభాగాలను సందర్శించారు. ఆసుపత్రి సేవలపై పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మెడికల్ కళాశాల, నర్సింగ్ కాలేజ్ నిర్మాణ పనులతో పాటు సీజనల్ వ్యాధు ల కట్టడి, తదితర వాటిపై ఆరా తీశారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, సీఎంఎస్‌ల పనితీరుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల విద్యార్థుల కోసం నిర్మిస్తున్న హాస్టల్స్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలి..

తమ సమస్యలను పరిష్కరించాలని ఆశ వర్కర్లు మంత్రికి వినతి పత్రం అందించారు. గానుగుపహాడ్ బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరుతూ యాసారపు కర్ణాకర్, సందీప్ తదితరులు కోరారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్ వెంటనే రిలీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మంత్రికి విన్నవించారు. ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు సిబ్బంది పెండింగ్ వేతనాలు అందించాలని మొరపెట్టుకున్నారు.

సత్కారం..

మంత్రి రాజనర్సింహను ఎమ్మెల్యే పల్లా, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ గోపాల్‌రావు, ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, వంగాల మల్లారెడ్డి, నర్సిరెడ్డి, జంగి విద్యానాథ్, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌కు సహకరించాలి

- సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్

జనగామ రూరల్: జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన కేసులను న్యాయవాదులు పరిష్కరించేలా కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ ఆదేశాల ప్రకారం మంగళవారం జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న జరగనున్న లోక్ అదాలత్‌పై బార్ అసోసియేషన్ అడ్వకేట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి న్యాయవాదుల సహకరించాలన్నారు. కేసులను మీడియేషన్ సెంటర్‌లో పరిష్కారమయ్యేట్లు చూడాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత, జూనియర్ కుమారి ఎ.శశి, కె.సందీప్, బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్

జనగామ రూరల్: సాధారణ తనిఖీలో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎం గోదామును షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ బెన్షలోమ్ సందర్శించారు. ఈ సందర్భంగా భద్రతా పుస్తకం, సీసీ కెమెరాల పనితీరు, అగ్ని నియంత్రణ సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు బి.భాస్కర్, బీఆర్ఎస్ నాయకుడు ఆర్.రవి, బీజేపీనుంచి ఎ.విజయభాస్కర్, టీడీపీకి చెందిన అజయ్, బీఎస్పీ చంద్రశేఖర్, ఆర్‌డీఓ గోపిరామ్, ఎన్నికల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

సాంకేతిక అక్షరాస్యత అందించాలి..

ఉపాధ్యాయులు సాంకేతిక అక్షరాస్యతను విద్యార్థులకు అందించడానికి కృషి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం డిజిటల్ అక్షరాస్యత బోధనను ప్రారంభించిన నేపథ్యంలో గణితం, ఫిజికల్ సైన్స్ టీచర్లకు సీజేఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో డిజిటల్ కంటెంట్‌పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో శిక్షణ సమన్వయకర్త ఏఎంఓ శ్రీనివాస్, డీఎస్ఓ ఉపేందర్, డీఆర్‌పీలు శ్రీకాంత్, కృష్ణవేణి, కృష్ణయ్య, మాధవరావు పాల్గొన్నారు.

ఆర్డర్లు లేకుండా డిప్యుటేషన్లు

- డీఈఓ ఆఫీసులో పలువురి తిష్ట

జనగామ: జిల్లా విద్యాశాఖలో డిప్యుటేషన్ల తతంగం పలు ఆరోపణలకు దారితీస్తోంది. ఐఏఎస్ ఆఫీసర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ బాధ్యతలను స్వీకరించిన తర్వాత కూడా ఎలాంటి ఆర్డర్లు లేకుండా కొంతమంది డిప్యూటేషన్లపై పనిచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలకు వెళ్లకుండా డీఈఓ కార్యాలయంలోనే ఉంటూ..ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల్లో చర్చ జరుగుతోంది. దీంతో సర్కారు బడులపై ఎంతో నమ్మకంతో వచ్చే విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని పలువురు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్డర్లు లేకుండా డిప్యుటేషన్లు అంటూ డీఈఓ కార్యాలయంలో తిష్ట వేసిన వారు ఎంతమంది..?అసలు ఎందుకు ఉంటున్నారు? అనే దానిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ పెరుగుతోంది. ఐఏఎస్ డీఈఓగా బాధ్యతలు చేపట్టిన తర్వాత డిప్యుటేషన్లపై ప్రస్తావన రాగా, ఆర్డర్లు ఉన్నాయంటే నమ్మబలికే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. దీనిపై కొంతమంది ఇటీవల కలెక్టర్ దృష్టికి సైతం తీసుకు వెళ్లినట్లు సమాచారం.

ఆగిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లొకేషన్ సమస్య రావడంతో ఆగిపోయాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రంగు రమేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు పొలబోయిన సురేశ్.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన హౌసింగ్ అధికారులకు సమస్య లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. మంగళవారం హౌసింగ్ పీడీ మాత్రునాయక్, డీఈ చంద్రశేఖర్, ఏఈ రవి గ్రామాన్ని సందర్శించి లబ్ధిదారుల నుంచి సమస్య అడిగి తెలుసుకున్నారు. మూడు రోజుల్లో లొకేషన్ సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.

ఎవరి బాధ వారిదే!

అదను దాటుతోందని పంటకు యూరియా వేయాలని రైతుల అరిగోస ఓవైపు .. భవిష్యత్తుకు బాటలు వేసే విద్యను అభ్యసించేందుకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లను అందించాలని విద్యార్థుల వ్యథ మరోవైపు.. ఈ రెండు వర్గాలు తమ బాధను ఏకకాలంలో వ్యక్తపరుస్తున్న ఘటన మంగళవారం జనగామ కలెక్టరేట్ వద్ద కనిపించింది. ఎస్ఎఫ్ఐ విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం ధర్నా చేస్తుండగా.. ఎదురుగా ఓ ఫర్టిలైజర్ షాపు వద్ద ఉదయం నుంచి యూరియా కోసం రైతులు బారులుదీరారు.



-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనగామ

మహబూబాబాద్: శనిగపురంలో యూరియా పంపిణీ కేంద్రం వద్ద టోకెన్ల కోసం బారులుదీరిన రైతులు, గూడూరు పీఏసీఎస్‌లో టోకెన్‌లు తీసుకుని బారులుదీరిన అన్నదాతలు







నెక్కొండ: మండల కేంద్రంలో అన్నదాతల క్యూ



రాయపర్తి పీఏసీఎస్‌లో బారులుదీరిన రైతులు



వెంకటాపురం(ఎం) పీఏసీఎస్ ఎదుట..

ఇంకా పడిగాపులే..

అన్నదాతలను యూరియా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. కొద్ది రోజుల నుంచి అందజేస్తున్న ఇంకా సరిపోవడం లేదు. ఫలితంగా పలు పీఏసీఎస్‌లు, ఫర్టిలైజర్ షాపుల వద్ద బారులుదీరుతున్నారు. చెప్పులు, ఆధార్ కార్డులు క్యూలో పెడుతూ పొద్దంత పడిగాపులు కాస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆందోళనలు, రాస్తారోకోలు చేస్తూ రోడ్లపై బైఠాయిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయా చోట్ల యూరియా కోసం బారులుదీరారు. అలాగే, రహదారులపై ఆందోళనలు చేపట్టారు. సరిపడినంతా యూరియా అందజేయాలని డిమాండ్ చేశారు.

- సాక్షి, నెట్‌వర్క్

గార్ల పీఏసీఎస్ ఎదుట చెప్పులను క్యూలో పెట్టిన రైతులు





ఖిలా వరంగల్ రైతు సొసైటీ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు



శివునిపల్లిలో హాకా సెంటర్ వద్ద..



రేగొండ ఆగ్రోస్ ఎదుట ..



జనగామ: పట్టణంలోని హాకా ఫార్మర్ సొసైటీ వద్ద..

నేడు మల్లన్నగండి కుడికాల్వ ప్రారంభం

- హాజరుకానున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్: దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గండి రామారం రిజర్వాయర్ (మల్లన్నగండి) కుడి కాల్వ ప్రారంభంతోపాటు పంట పొలాలకు సాగునీరు అందించే కార్యక్రమాన్ని నేడు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో రెండు మండలాల పరిధిలోని 11 గ్రామాల్లో 5,600 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 14 కి.మీ పొడవుతో రూ.29 కోట్ల వ్యయంతో నిర్మించిన కాల్వ ప్రారంభోత్సవం, నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. కాగా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో ఎట్టకేలకు సాగునీటి సమస్య పరిష్కారం కానుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యూరియా వచ్చేసింది..

- ఉమ్మడి జిల్లాకు 1,336.050 మెట్రిక్ టన్నులు
- జిల్లాలకు సర్దుబాటు చేసిన అధికారులు

ఖిలా వరంగల్: కోరమండల్ కంపెనీకి చెందిన సీబీఎల్ యూరియా మంగళవారం వరంగల్ గూడ్స్ షెడ్‌కు చేరింది. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు యూరియా పంపించేందుకు వ్యవసాయ అధికారులు సర్దుబాటు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు 1,336.050 మెట్రిక్ టన్నుల యూరియా చేరగా మార్క్‌ఫెడ్‌కు 60 శాతం, ప్రైవేట్ డీలర్లకు 40 శాతం కేటాయించారు.

రూ. 3.81 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

నలుగురు అరెస్ట్, మరో నలుగురు పరార్

- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం: వరంగల్ జిల్లా ఖానాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలుకలగుట్ట దగ్గర భారీ ఎత్తున గంజాయిని పట్టుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏపీ, ఒడిశా రాష్ట్రాల నుంచి కర్ణాటకకు సరఫరా చేయడానికి గంజాయి సిద్ధంగా ఉందనే సమాచారం మేరకు ఖానాపురం, వరంగల్ డ్రగ్ కంట్రోల్ టీం సంయుక్తంగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.3,81,92,250 విలువైన 763 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నట్లు సీపీ చెప్పారు.

నిందితులు వీరే..

ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా మారేడిమిల్లి మండలం గుంపినగండి గ్రామానికి చెందిన అందాల పాండురెడ్డి, ఒడిశాలోని నిమ్మలపాలెం గ్రామానికి చెందిన గుల్లారి మునిరాజ్, దులగండి గ్రామానికి చెందిన కొప్పు కోటయ్య, తెలంగాణలోని సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం పోలారంతండాకు చెందిన భూక్య సాయికుమార్, కలిమేల మండలం గుర్రలూరు గ్రామానికి చెందిన రమేశ్, గిల్లమడుగు గ్రామానికి చెందిన మజ్జి కృష్ణ, నిమ్మలపాలెం గ్రామానికి చెందిన నాయిని రమేశ్, బీదర్‌కు చెందిన ప్రకాశ్.

గంజాయిని దాచి..ఆపై పట్టుబడి

నిందితులు పాండు రెడ్డి, గుల్లారి మునిరాజ్, కొప్పు కోటయ్య, భూక్య సాయికుమార్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో మరో ఇద్దరు నిందితులు రమేశ్, మజ్జి కృష్ణ గంజాయి అమ్ముతున్నారని తెలుసుకుని వారితో పరిచయం పెంచుకున్నారు. అనంతరం రమేశ్, మజ్జి కృష్ణ ఆదేశాల మేరకు గంజాయిని వాహనాల్లో వారు చెప్పిన చోటుకు చేర్చేవారు. దీనికి రూ.వెయ్యి చొప్పున కూలి కట్టించేవారు. ఇందులో భాగంగా గత నెల 28న నిందితులు పాండు, మునిరాజ్, కోటయ్య, రమేశ్ కలిసి తులసిపాక నుంచి నంబర్‌లేని ఆటో ట్రాలీలో గంజాయి తీసుకుని భద్రాచలం, ఇల్లందు మీదుగా వరంగల్ బయలుదేరారు. ఈ క్రమంలో పాకాల దాటిన తర్వాత పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు గమనించిన నిందితులు ఈ విషయాన్ని కృష్ణకు చేరవేశారు. దీంతో అతడి ఆదేశాల మేరకు చిలుకలగుట్టపై గంజాయి బస్తాలు దాచి వెళ్లిపోయారు. అనంతరం ఈనెల 1న సాయికుమార్.. గంజాయి కొనుగోలు చేసే వ్యక్తిని తీసుకొస్తున్నాడని రమేశ్ ఫోన్ ద్వారా మునిరాజ్, కోటయ్య, మజ్జి కృష్ణకు చెప్పాడు. గంజాయి బస్తాలను కిందికి గుట్ట నుంచి దించుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని 23 గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. సాయికుమార్, మనిరాజ్, కోటయ్య, మజ్జి కృష్ణను అరెస్ట్ చేయగా పాండురెడ్డి, ఎస్. రమేశ్, ప్రకాశ్, రమేశ్ పరారయ్యారని సీపీ తెలిపారు. పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్న పోలీస్ అధికారులను సీపీ అభినందించి రివార్డులు అందజేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సతీశ్ పాల్గొన్నారు.



నగదు రివార్డు అందుకుంటున్న ఎస్‌బీ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి

సీఓఈల్లో ప్రవేశానికి నేడు పరీక్ష

న్యూశాయంపేట : సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ) కళాశాలల్లో ప్రవేశానికి నేడు(బుధవారం) పరీక్ష నిర్వహించనున్నారు. వరంగల్ రంగశాయిపేట శివారు జక్కలొద్ది బాలుర గురుకులంలో బాలురు, కేయూ క్రాస్‌రోడ్‌లోని బాలికల గురుకులంలో బాలికల కోసం పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకులాల నుంచి ఐఐటీ కోచింగ్ కోసం 75, నీట్ కోసం 31 మంది మొత్తం 106 మంది బాలురు దరఖాస్తు చేసుకున్నారు. బాలికలు ఐఐటీ ప్రత్యేక కోచింగ్ 64, నీట్ కోసం 89 మంది బాలికలు మొత్తం 153 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ జంగా సతీశ్ తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 3.30 వరకు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

మంత్రుల కాన్వాయ్ అడ్డగింత



బీఆర్ఎస్ కార్యకర్తలను పక్కకు నెట్టిన పోలీసులు



సత్యవతిరాథోడ్, కవితను అడ్డుకుంటున్న పోలీసులు

- మాజీ మంత్రి, మాజీ ఎంపీ రోడ్డుపై బైఠాయింపు
- కాళేశ్వరంపై సీబీఐ విచారణను ఉపసంహరించుకోవాలి

కురవి: రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత ఆధ్వర్యంలో మంగళవారం మహబూబాబాద్ జిల్లా కురవిలోని 365 జాతీయ రహదారిపై మంత్రుల కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. మంత్రులు దామోదరరాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మానుకోటలో మెడికల్ కాలేజీ భవన సముదాయాన్ని ప్రారంభించేందుకు మరిపెడ నుంచి కురవి మీదుగా జిల్లా కేంద్రానికి వస్తున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి, మాజీ ఎంపీ.. పార్టీ శ్రేణులతో కలిసి కురవిలోని 365 జాతీయ రహదారి వద్దకు చేరుకున్నారు. దీంతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య గమనించి మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌తో పలుమార్లు మాట్లాడి ధర్నా విరమించుకుని సహకరించాలని సూచించగా ససేమిరా అన్నారు. ఈ క్రమంలో మంత్రుల కాన్వాయ్ కురవికి చేరుకున్న సమయంలో కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో మాజీ మంత్రి, సత్యవతి, మాజీ ఎంపీ కవిత రోడ్డుపై బైఠాయించారు. ఈ సమయంలో మంత్రుల కాన్వాయ్ ధర్నా ప్రదేశానికి చేరుకుంది. దీంతో స్పెషల్ పార్టీ పోలీసులు రోప్ సాయంతో కాన్వాయ్‌ను మానుకోట వైపునకు పంపించారు.

చంద్రబాబు కళ్లల్లో ఆనందం చూసేందుకు..

ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్, మాలోత్ కవిత మాట్లాడుతూ.. కాళేశ్వరం నీరును ఆంధ్రాకు పంపించి ఏపీ సీఎం చంద్రబాబు మెప్పుపొందేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబు కళ్లల్లో ఆనందం చూసేందుకు కాళేశ్వరంపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. కాళేశ్వరాన్ని ఎండబెడితే బనకచర్లకు లాభం జరుగుతుందనే ఉద్దేశంతో సీఎం రేవంత్ సైకోలా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిచ్చిరెడ్డి, లాలయ్య, రవినాయక్, భరత్, రాంచంద్రయ్య, మల్లికార్జున్, రమేశ్ పాల్గొన్నారు.

అన్నారంలో రెండోరోజు ఏడీసీపీ సర్వే

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం(సరస్వతీ) బరాజ్‌లో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు పుణెకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్ సీనియర్ సైంటిస్టులు డాక్టర్ సంపత్ శ్రీకాంత్, నాగరాజు ఆధ్వర్యంలో ఏడీసీపీ (అకౌస్టిక్ డాప్లర్ కరంట్ (ప్రొఫైలర్) సర్వేను రెండు రోజులుగా చేస్తున్నారు. మంగళవారం బరాజ్‌లోని నీటి పరిమాణం, లోతును అంచనా వేశారు. బరాజ్‌లోకి 2.30లక్షల క్యూసెక్కుల నీరు ఎగువనుంచి తరలివస్తోంది. వారి వెంట డీఈఈ రవిచంద్ర తదితరులు ఉన్నారు.



అన్నారం బరాజ్‌లో ఏడీసీపీ సర్వే చేస్తున్న సైంటిస్టులు

గుత్త మేస్త్రీ దారుణ హత్య..


- బ్యాంకుకు వెళ్తొస్తానని హత్యకు గురైన మహిళ
- రోడ్డు పక్క నీటి గుంతలో తేలిన మృతదేహం
- పురుషోత్తమాయగూడెం శివారులో ఘటన..
- ఉల్లెపల్లికి చెందిన మహిళగా గుర్తింపు



వెంకటమ్మ (ఫైల్)

మరిపెడ రూరల్: మహిళా వ్యవసాయ కూలీల గుత్త మేస్త్రీ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, మరిపెడ సీఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ఉల్లెపల్లికి చెందిన మహిళా వ్యవసాయ కూలీల మేస్త్రీ బంటు వెంకటమ్మ (55) సోమవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో పని చూసుకుని, ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామంలో డబ్బులు తీసుకురావడానికి వెళ్లింది. అనంతరం సాయంత్రం నాలుగు గంటల సమయంలో తన కూతురు ఉపేంద్రకు ఫోన్ చేసి తాను ఇంటికి వస్తున్నానని, తమ్ముడు నరేశ్‌ను బైక్ తీసుకుని పురుషోత్తమాయగూడెం స్టేజీ వద్దకు రమ్మని చెప్పింది. కుమారుడు స్టేజీ వద్దకు వచ్చి తల్లి వెంకటమ్మకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. కొంత సమయం వేచి చూసి కుమారుడు తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన ఓ రైతు పొలం వద్దకు వెళ్తున్న క్రమంలో జోగులపాడు రహదారిలో నీటి గుంతలో సదరు మహిళ మృతదేహం తేలి ఉంది. ఈ విషయం తెలుసుకున్న మృతురాలి కుమార్తె ఉపేంద్ర ఘటనాస్థలికి చేరుకుని తల్లిగా గుర్తించింది. మృతదేహం సమీపంలోని రహదారిలో రక్తపు మరకలు, పగిలిన గాజులు, మద్యం బాటిళ్ల లేబుల్స్ ఉన్నాయి. సదరు మహిళను దుండగులు చున్నీతో ఉరేసి గొంతులో పొడిచి హత్యచేశారు. అనంతరం ఈడ్చుకెళ్లి నీటి గుంతలో పడేసిన ఆనవాళ్లు ఉన్నాయి. ఘటనాస్థలికి మరిపెడ సీఐ రాజ్‌కుమార్ చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతురాలు కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి భర్త లింగయ్య, కుమారుడు, కూతురు ఉంది.

గుంతలోపడి రైతు మృతి



శంకర్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: గుంతలోపడి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ మండలం కేవులతండా గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అజ్మీరా శంకర్(45) రాత్రి సమయంలో బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న గుంతను గమనించక ప్రమాదవశాత్తు అందులో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య బుల్లి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మంత్రి దామోదరకు సమస్యల ఏకరువు..

- వైద్య విద్యార్థులతో మంత్రి ముఖాముఖి

నెహ్రూసెంటర్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వైద్య విద్యార్థులు సమస్యల ఏకరువు పెట్టారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కళాశాల హాస్టళ్ల భవనాలు ప్రారంభించిన అనంతరం మంత్రి రాజనర్సింహ.. వైద్య విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలలో అందుతున్న సౌకర్యాలు, కల్పించాల్సిన వసతులను వివరించారు. కాగా, విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన వైద్య విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రులు తెలిపారు.



మంత్రులకు సమస్యలను వివరిస్తున్న వైద్య విద్యార్థిని

రవాణా సౌకర్యం లేక ఇబ్బంది..



మెడికల్ కళాశాల నుంచి ప్రభుత్వ ఆస్పత్రి, హాస్టళ్లకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నాం. అలాగే, కుటుంబ దత్తత ప్రోగ్రాం నిమిత్తం గ్రామాలకు వెళ్లాల్సిన సమయంలో రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం.

- దమయంతి, వైద్య విద్యార్థిని

ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటున్నాం..



హాస్టల్ భవనాలు పూర్తి కాకపోవడంతో ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటున్నాం. రోజూ కళాశాల నుంచి ఆస్పత్రి, హాస్టళ్లకు 15 కిలో మీటర్ల మేర నడవాల్సి వస్తోంది. థర్డ్ ఇయర్ చదువుతున్నాం. హాస్టళ్ల ఏర్పాటు చేస్తే పీజీకి ప్రిపేర్ అవుతాం.

- సత్యేంద్ర పాండే, వైద్య విద్యార్థి

గ్రౌండ్ ఏర్పాటు చేయాలి..



కళాశాలలో ప్లే గ్రౌండ్, జిమ్ ఏర్పాటు చేయాలి. విద్యతోపాటు శారీరక ఫిట్‌నెస్ కోసం గ్రౌండ్ ఉపయోగపడుతుంది. విద్యార్థుల ఇంటరాక్టివ్, మీటింగ్ కోసం ఆడిటోరియం ఏర్పాటు చేయాలి. బిల్డింగ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి.

- ఏహ్తెషామ్, వైద్య విద్యార్థి

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి..



హాస్టళ్లు, ఆస్పత్రి, కళాశాల బిల్డింగ్‌లు త్వరగా పూర్తి చేయాలి. ట్రాన్స్‌పోర్టు సమస్య పరిష్కరించాలి. స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి. లైబ్రరీ ఏర్పాటుచేసి బుక్స్ అందించాలి. సెంట్రల్ లైబ్రరీ, ఈ–లైబ్రరీ అందుబాటులోకి తీసుకురావాలి.

- అనీషా, వైద్య విద్యార్థిని

కిటెక్స్ కంపెనీలో గార్మెంట్ల తయారీ ప్రారంభం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- ఎక్స్ వేదికగా సంతోషం

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)లో నెలకొల్పిన కేరళకు చెందిన కిటెక్స్ కంపెనీలో గార్మెంట్ల తయారీ ప్రారంభమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. మంగళవారం ట్విట్టర్(ఎక్స్) వేదికగా కంపెనీలో ఉత్పత్తి ప్రారంభమైందంటూ సంతోషం పంచుకున్నారు. కేరళ నుంచి కిటెక్స్ కంపెనీని తెలంగాణ(వరంగల్)కు తీసుకురావడం ఇంకా తన కళ్ల ముందే కనిపిస్తోందన్నారు. వాణిజ్య ఉత్పత్తులను ప్రారంభించడంపై కిటెక్స్ కంపెనీ యాజమాన్యానికి, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వం, అవినీతిరహిత పాలనతోనే ప్రతిష్టాత్మక కిటెక్స్ సంస్థ తెలంగాణకు వచ్చిందని, భవిష్యత్‌లో రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ఈ కంపెనీ కీలక భూమిక పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



కేఎంటీపీలోని కిటెక్స్ కంపెనీ షెడ్‌లు